



పి.వి.ప్రభాకరమూర్తి

# రామప్ప వంట

ఆ చుట్టుపక్కల గ్రామాల్లో రామప్ప చేతివంట లేకుండా ఏ పెళ్ళిళ్ళూ జరిగేవి కావంటే అతిశయోక్తి కాదు. ఇంటి వంట చెయ్యడంలో చేయితిరిగిన ఆడవారు, రామప్ప వంట చేస్తుంటే అతని చేతివాటానికి గుడ్లప్పగించి చూసే వారంటే మీరు నమ్మితీరవలసిందే.

అతను కాజా చేసినా, కాకరకాయ పులుసు చేసినా అద్భుతంగా వుండేవి. చివరికి గడ్డితోపచ్చడి చేసి అది రామప్ప చేసిన పచ్చడంటే జనం పడి చచ్చేవారు. ఏ జమిందారు ఇంట్లో శుభకార్యం అయినా రామప్పకి ఖాళీ వుందంటేనే వాళ్ళు ముహూర్తం పెట్టించుకునే వారంటే రామప్పచేతి మహత్యం ఎలా వుండేదో మీరు ఊహించుకోవచ్చు.

అతను ఊరి చివర్న పాకలో వుంటాడు. చిన్న తనం నుండి ఆ పాకే వాడి నివాసం. ఆ పాకలోనే వాడు పుట్టాడు. పాకడం మొదలుపెట్టాడు. చిన్నత నంలో చిందులేసింది అక్కడే. యవ్వనంలో కలలు కన్నది అక్కడే. పార్వతమ్మని మనువాడింది ఆ పాక లోనే. కొన్నేళ్ళుగా పాకమీది తాటాకులు మారుతు న్నాయి. కానీ రామప్ప కూర్చుని జీవితాన్ని నెమరువే సుకొనే స్థలం మారలేదు. వాడు పడుకునే నులక మంచం మారలేదు. పెళ్ళయి సంవత్సరం తిరక్కుం డానే కూరలో కరివేపాకులా సువాసన ఇచ్చి తప్పు కుంది రాములమ్మ. కలవాళ్ళకు వచ్చే మాయరోగం రాములమ్మని పట్టుకుపోయింది.

వయస్సు మీదపడటంతో ఒక సంవత్సరం నుంచీ రామప్ప వంట పనులు తగ్గించేసాడు. మతి మరపు అతని వంటని పాడు చేసింది. రుచి చూస్తే గానీ ఉప్పువేసాడో లేదో తెలియని పరిస్థితి వచ్చింది. అతని చేతివంట అమృతంకన్నా అద్భుతం అన్నవా ళ్ళంతా "అబ్బే! పాడు చేసేస్తున్నాడు" అంటూ పెదవి విరవడం మొదలుపెట్టారు. మతిమరపు తోడు కంటిచూపుకూడా మందగించింది.

రామప్పకి ఒకే ఒక కోరిక మిగిలిపోయింది. ఊరిచివర్న గుట్టమీద వున్న వెంకన్నబాబు గుడిలో ఒక పూట వంటచేయడం. తను తయారుచేసిన వంటని వెంకన్నబాబుకి ఆచార్యులుగారిచే ఆర గింపు పెట్టించడం తీరని కోరికగా ఉండిపోయింది. "తప్పురా రాముడా! దేవుడికి వంట నేనే చేయాలి. శాస్త్రాల్ని మనం మార్చకూడదు కదా!" అనేవారు ఆచార్యులుగారు. "నేను పోయేలోగా నా కోరికని ఎలాగయినా తీర్చండి సామీ" అనేవాడు రామప్ప.

రామప్పకి చిన్నతనం నుండి గుట్టమీద వెంకన్న బాబంటే విపరీతమయిన భక్తి. ఏ పనిచేసినా ఆయ నని తలచుకోకుండా మొదలుపెట్టేవాడు కాదు. ముఖ్యంగా వంటలు చేసేటప్పుడు వెంకన్నబాబుని తలచుకొని కొబ్బరికాయకొట్టి పని మొదలుపెట్టే వాడు. మనస్సులోనే స్వామిని ప్రతిష్ఠించుకున్నాడు. రామప్ప భక్తిని చూసి "ఒరేయ్! రాముడూ ఆ స్వామి నిరంతరం ఆయన పాదాల దగ్గరవుండే నాకు కాకుండా నీకే ముందుగా మోక్షం ప్రసాదిస్తా దేమోరా!" అనేవారు ఆచార్యులుగారు.

ఒకరోజు రామప్పకి గుట్టమీద వెంకన్నబాబు కలలో కనిపించి "నీ చేతి వంట తినాలనుంది. ఎప్పుడు పెడతావు? అమ్మగారు కూడా రుచి చూడా లని ఉవ్విళ్ళూరుతోంది. మంచిరోజు చూసుకుని రా!" అన్నాడు.

మెలకువ వచ్చిన రామన్న ఆనందంతో చిందులే సాడు. పరుగుపరుగున ఆచార్యులుగారిని కలిసి విషయం చెప్పాడు. అంతా విన్న ఆచార్యులుగారు "ఒరేయ్! రాముడూ నువ్వు నిజంగా అదృష్టవంతుడి విరా. స్వామే సెలవిచ్చినప్పుడు ఆపడానికి నేనెంత వాడినిరా! మంచిరోజు చూసి కబురంపుతాను. వచ్చి నీ కల నెరవేర్చుకో" భక్తితో చేతులు జోడించి అన్నారు.

ఆరోజు నుండి పంతులుగారి కబురుగురించి ఎదురుచూస్తున్నాడు రామప్ప. ఇంతలో మేకలు తోలుకుంటూ వచ్చాడు ఏసోబు. "రామప్పగారూ! మిమ్మల్ని గుట్టమీది వెంకన్నబాబు గుళ్ళో ఆచార్య ులుగారు రమ్మన్నారు" తువ్వాల్లో వున్న సీమచింతకా యల్ని నులకమంచం చివర్నపోస్తూ అన్నాడు ఏసోబు. లాంగ్‌బెల్ కొట్టినప్పుడు పరుగెత్తే పిల్లా డిలా గుడిదగ్గరికి పరుగుతీసాడు రామప్ప. ఆచార్య ులుగారు వాడిని మూల మండపం వెనక్కి తీసుకెళ్ళి "ఒరేయ్! రాముడూ రేపు మంచిరోజు, ఉదయం ఐదుగంటలకు వచ్చి వంటపని మొదలుపెట్టు. మరీ పొద్దెక్కాక రాకు, ఊళ్ళోవాళ్ళు వచ్చేస్తారు. తర్వాత నీకు నాకు ఇబ్బంది" అని చెవిలోచెప్పి గుడిలోకి వెళ్ళిపోయారు ఆచార్యులుగారు.

ఆకాశానికి చిల్లులుపడ్డట్టుగా సాయంత్రం నుండి వర్షం కురుస్తోంది. రాత్రికి ఊళ్ళని ముంచే సింది. జనజీవనం కకావికలమయింది. చెట్టుచే మలు ప్రకృతి ప్రతాపానికి తట్టుకోలేక తలక్రిందులై పోయాయి. ఇళ్ళు పేకమేడల్లా కూలిపోయాయి. నీటమునిగిన పశువులు నరకయాతన అనుభవించి చచ్చికొట్టుకుపోయాయి.

రామప్ప నులకమంచం మీద పడుకుని సాయంత్రం నుండి దేవుడ్ని మనసారా జపిస్తు న్నాడు. ఎప్పుడు తెల్లారుతుందా, దేవుడి గుడిలో వంట ప్రారంభిద్దామనే దృష్టితోనే వున్నాడు. ఊరంతా అల్లకల్లోలమయినా, నులకమంచం మీది రామప్పమాత్రం దైవధ్యానంలో వున్నాడు. పెద్ద పెద్ద మేడలు పునాదులతో లేచిపోయినా రామప్ప గుడిసె మాత్రం గుండ్రాయిలా ఉంది. వెంకన్న చల్లని చూపుంటే అంతేమరి అనుకున్నారు చుట్టుపక్కల జనం.

ప్రకృతి కన్నెర్రజేసినా గుట్టమీద వెంకన్నబాబు గుడిలో సేవలు మామూలుగానే జరుగుతున్నాయి. ఆరునూరయినా తన ప్రాణం పోయేంతవరకూ ఆచార్యులుగారు సేవచేయడం మానరని వెంకన్న బాబుకి తెలుసు. అందుకే రామప్ప రాక గురించి ఎదురుచూస్తున్నారు ఆచార్యులుగారు. ఆలస్యమ

య్యేకొద్దీ ఉండబట్టలేక పరుగుపరుగున రామప్ప గుడిసె దగ్గరికి వచ్చారు. మంచంమీద ముడుచుకు పడుకున్న రామప్పని చూసి "ఒరేయ్! రాముడూ వెంకన్నబాబుకి వంట చేస్తానన్నావు కదరా! రాయి కట్టని పొట్లకాయలా ముడుచుకు పడుకున్నావే మిత్రా" అన్నారు. అక్కడేవున్న ఏసోబు రామప్పని తట్టిలేపబోయి అవాక్కయ్యాడు.

రామప్ప తడిసిమొద్దులా చలనం లేకుండా చల్లగా వున్నాడు. "పాపం రాత్రి నిద్రలో పోయుంటాడు" అన్నాడు ఏసోబు. "వాడి ఆఖరికోరిక తీరకుండానే వెళ్ళిపోయవాడు" కళ్ళు తుడుచుకుంటూ అనుకున్నారు ఆచార్యులుగారు. ఊళ్ళో పెద్దలకి చెప్పి జరగవలసిన తతంగం జరిపించారు.

పదిరోజుల నుండీ దిగులుగా వున్నారు ఆచార్యులుగారు. రామప్ప చిన్నతనం నుంచీ ఆయనకి తెలుసు. ఏ పని చెప్పినా చటుక్కున చేసుకొచ్చేవాడు. పనిచేసినందుకు పది పరకా ఇస్తుంటే తీసుకునేవాడు కాదు. రామప్పని వెంకన్నబాబు నీ చేతి వంట తినాలనుందన్నాడు. వంట చేసి పెట్టమన్నాడు. మరి ఎందుకు రామప్పకి వంట చేసి సేవ చేయాలనే కోరికను తీర్చకుండా తీసుకెళ్ళిపోయాడు. ఇదే విషయాన్ని పదిరోజుల నుండి పంతులుగారు ఆలోచిస్తున్నారు. ఈ విషయం ఆయనకు సమాధానం దొరకని ప్రశ్న అయిపోయింది.

సాయంత్రం వేళ చంద్రుడు పాలకోవా బిళ్ళలా గుండ్రంగా వున్నాడు. మూలమండపంలో కూర్చున్నారు ఆచార్యులుగారు. ఇంతలో ఒక వ్యక్తి అటుగా వచ్చాడు. వస్తూనే ఆచార్యులుగారికి నమస్కారం పెట్టాడు. మనిషి ఆజానుబాహువు. అతను కట్టుకున్న తెల్లబట్టలు శరీరం మీద చిక్కటి పాలు వలకబోసుకున్నట్లుగా వున్నాయి. నామం తీక్షణంగా వుంది. గంధం వాసన గుబాళిస్తోంది. "ఆచార్యులుగారూ! మీరు అడిగే ఏ ప్రశ్నకైనా ఇట్టే సమాధానం చెప్పగలను" అన్నాడు. ఆ వచ్చినవ్యక్తి క్రింద మెట్టు మీద కూర్చుంటూ. ఇతనేమిటి ఉన్నట్లుండి సంభాషణ ఇలా అడ్డదిడ్డంగా మొదలుపెట్టాడు అనుకున్నారు ఆచార్యులుగారు ఆశ్చర్యంగా. మీ మనసులో అనుమానాల్ని కూడా తీర్చగలను అన్నాడతను ఆచార్యులుగారిని మళ్ళీ ఆశ్చర్యపరుస్తూ.

ఆచార్యులుగారు తడుముకోకుండా రామప్ప విషయం అడిగారు. "రామప్పని వంట చేయమన్నాడు స్వామి. కానీ గుళ్ళోనే చేయమని చెప్పలేదు కదా! అతని వంట రుచి గురించి విన్నస్వామి, అతనిని తన స్వంత వంటవాడిగా ఉపయోగించుకోవడానికి తీసుకెళ్ళిపోయాడని మీరు ఎందుకనుకోకూడదు?" ముగించాడావ్యక్తి. సరైన సమాధానం దొరికిన ఆచార్యులుగారు తన్మయత్వంతో కనులు మూసుకుని "శ్రీనివాసా! నీ లీలలు అమోఘం" అంటూ కాసేపటికి కళ్ళు తెరిచారు. ఎదురుగా వ్యక్తి కనిపించలేదు. గంధం వాసన నెమ్మదిగా దూరమయింది. గుడంతా తిరిగారు కనిపించలేదు. గుడిలో విగ్రహం మాత్రం మునుపెన్నడూ లేనట్లు చిరునవ్వుతో దర్శనమిచ్చింది ఆచార్యులుగారికి.

○

